క్లుప్తంగా

దింటిమెరకలో ఉచిత వైద్య శిబిరం

కోడూరు:ఘంటసాలకు చెందిన పర్ణశాల ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో మండలంలోని దింటిమెరక గ్రామంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని సర్వశక్తుని ప్రార్థనా మందిరంలో మచిలీపట్నంకు చెందిన వైద్యులు యక్కటి ప్రవళిక పర్యవేక్షణలో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, దగ్గు, ఆస్తమా, మోకాళ్ల నొప్పులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి వైద్యం చేశారు. ఈ శిబిరంలో 122 మంది రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందించారు. గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పర్వదినాలను పురస్కరించుకొని ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పాస్టర్లు పిఎస్.రాజు, వెంకటరత్నం, కిరణ్, సుకన్య, బిందు, చంద్రశేఖర్, ప్రదీప్, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

రామాలయం అభివృద్ధికి రూ.25 వేలు విరాళం

చల్లపల్లి: శ్రీలక్ష్మీ విఘ్నేశ్వర ట్యాక్సీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు, చల్లపల్లి గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ ముమ్మనేని రాజకుమార్(నాని) స్థానిక పడమరవీధిలో వేంచేసియున్న రాఘవపురపు వెంకటకృష్ణమ్మ జానకీ రామాలయం గర్భగుడి తలుపుల ఏర్పాటు నిమిత్తం రూ.25వేలు విరాళాన్ని ఆదివారం అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పుట్టం వెంకటేశ్వరరావుకు విరాళం మొత్తాన్ని నగదు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కుమారుడు మండలి వెంకట్రామ్, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, వార్డు సభ్యులు బళ్లా వాసు, నాయకులు కొనగళ్ళ బుల్లయ్య, మోర్ల శివ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యం

మచిలీపట్నంటౌన్: శ్రీరామనవమి సందర్భంగా మూడేళ్ల వయసున్న చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన అమితంగా ఆకట్టుకుంది. నగరంలోని రాజుపేట చెక్కల మేడ సమీపాన ఉన్న శ్రీ కోదండయ రామాలయం వద్ద సీతారాముల కళ్యాణ ఘట్టం ముగిసిన తర్వాత సీతారామ చరితం.. అంటూ సాగే శ్రీరామరాజ్యం చిత్ర గీతానికి చిన్నారులు లయ బద్ధంగా నృత్యం చేయటంతో భక్తులు భక్తి పారవశ్యంతో ఉప్పొంగిపోయారు. రాజుపేటకు చెందిన వడ్డి నవీష, వడ్డి నవీష్న, చలమలశెట్టి అక్షర చేసిన నృత్యం ఆకట్టుకుంది.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం

బంటుమిల్లి: పాశ్చాపురం గ్రామంలో కొలువై ఉన్న సువర్చలాంజనేయస్వామివారి ఆలయంలో ఆదివారం నుంచి శ్రీ హనుమాన్‌చాలీసా పారాయణ మహాయజ్ఞం మొదలైంది. గత 6 సంవత్సరాలుగా దాదాపు 47 రోజులపాటు శ్రీ హనుమజ్జయంతి వరకు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని 11 సార్లు చాలీసా పఠించారు. అనంతరం అర్చకులు రొంపిచర్ల హనుమంతాచార్యులు భక్తులకు మంత్రపుష్పం, ప్రసాదం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులతో లాభాలు

మోపిదేవి: వేసవి దుక్కుల వల్ల అనేక లాభాలు ఉన్నాయని ఘంటసాల కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సంధ్య, డాక్టర్ అపర్ణ తెలిపారు. మండల కేంద్రంలో బాపట్ల కళాశాల విద్యార్థులు చేపట్టిన గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం ఆదివారం నిర్వహించారు. రైతుల సమక్షంలో మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వేసవి దుక్కుల వల్ల కలిగే ప్రయోజనాలు, లాభాలు, భూమి నుంచి వచ్చే తెగులు, కీటకాలను వేసవి దుక్కుల నుంచి నివారించవచ్చునని తెలిపారు. అనంతరం అభ్యుదయ రైతులు జొన్నలగడ్డ పిచ్చేశ్వరావుతో వివిధ రకాల పంటలు, సాగు చేసే విధానం, సస్యరక్షణ గురించి సందేహాలను నివృత్తి చేశారు.

రాంబాబును పరామర్శించిన సింహాద్రి

కొక్కిలిగడ్డ(మోపిదేవి): గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త రాయన రాంబాబు అనారోగ్యంతో హాస్పటల్‌లో చికిత్స పొంది ఇటీవల ఇంటికి వచ్చారు. విషయం తెలుసుకున్న అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కొక్కిలిగడ్డలో వారి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న రాంబాబును ఆదివారం సాయంత్రం పరామర్శించారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ కన్వీనర్ రాయన సత్యానారాయణ, మీసాల చిట్టిబాబు, కేసాని సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

చెన్నును అభినందించిన మాజీ ఎమ్మెల్యే

అవనిగడ్డ: వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమితులైన నాగాయలంకకు చెందిన చెన్ను రంగారావుని మాజీ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు అభినందించారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సింహాద్రి ఆయనను అభినందిస్తూ పార్టీ అభ్యున్నతికి పాటు పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తోట సాయిబాబు, మద్దికొండలు, చిట్టా బాలపాపారావు, బందెల నాగబాబు పాల్గొన్నారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం

మచిలీపట్నంటౌన్: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా నగరంలో ఆదివారం సీతారాముల కల్యాణ ఘట్టం వైభవంగా జరిగింది. నగరంలోని పలు రామాలయాలతో పాటు ఇతర దేవాలయాలు, చలువ పందిళ్ల వద్ద సీతారాముల కల్యాణం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణాన్ని నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చున్నారు. భక్తులకు పానకం, చలిమిడి, వడపప్పు ప్రసాదాన్ని అందజేశారు. పలు ఆలయాల వద్ద నిర్వహించిన అన్న సమారాధనలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. రుస్తుంబాదలో వేంచేసి ఉన్న శ్రీ భద్రాద్రి శ్రీరాముల వారి దేవాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నిత్యహోమం, చతుస్థానార్చన, బలిహరణ నిర్వహించారు. అనంతరం జరిగిన కల్యాణంలో కూనపరెడ్డి శ్రీకృష్ణారావు దంపతులు పీటలపై కూర్చున్నారు. రాజుపేట చెక్కల మేడ సమీపంలోని రామాలయం వద్ద స్వామి వార్ల కల్యాణం అత్యత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ భక్త కమిటీ ప్రతినిధులు నూకల సురేష్, ప్రసాద్ పర్యవేక్షించారు. కోనేరుసెంటర్‌లో పండ్ల వర్తక సంఘం, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్, నార, ఇనుప, పచారి కొట్ల సందులోని రామాలయం, రంగనాయక స్వామి దేవస్థాన వాణిజ్య దుకాణాల నిర్వాహకులు, బస్టాండ్ సెంటర్‌లో టాక్సీ అసోసియేషన్, నిజాంపేటలోని బ్రాహ్మణ అగ్రహారంలోని రామాలయంతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న రామాలయాల్లో, ఇతర దేవాలయాల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవాలు నిర్వహించారు.

లంకలో కమనీయం.. కల్యాణం...

నాగాయలంక: మండలంలోని భావదేవరపల్లి పెద్దూరు శ్రీరామ మందిరంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, విజయలక్ష్మి దంపతులు కల్యాణ సీతారాములకు తలంబ్రాలు పోశారు. సర్పంచ్, ఆలయ ధర్మకర్త మండలి ఉదయభాస్కర్–స్వర్ణ, వెంకట్రామ్–కృష్ణవేణి, కాశేశ్వరరావు–విజయలక్ష్మి పీటలపై కూర్చున్నారు. బ్రహ్మశ్రీ పెద్దిభట్ల భార్గవశాస్త్రి, వఝుల నాంచారయ్య శాస్త్రి బ్రహ్మత్వంలో స్వామివారి కల్యాణ క్రతువు కమనీయంగా జరిగింది. మండలి రాజా, పీసీ చైర్మన్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. నాగాయలంక కృష్ణానదితీరం లోని శ్రీరామ పాద క్షేత్రంలో ముదునూరు శ్రీనివాసశాస్త్రి బ్రహ్మత్వంలో సాయిమెస్ అధినేత చుండూరు రుషికుమార్, శోభాదేవి దంపతులు కల్యాణం జరిపారు. నాగాయలంకలోని తిప్పాలెం, సబ్బనేని బజారు, తూర్పు బజారు, పల్లెపాలెం రామాలయాల్లో శ్రీరామ కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల నుంచి సీతారాముల చిత్ర పటాలతో పుణ్యస్నానాలకు కృష్ణానదికి ఊరేగింపుగా తరలివచ్చారు. రేమాలవారిపాలెం శ్రీసీతా రామాంజనేయ స్వామి ఆలయం, వక్కపట్లవారిపాలెం, మర్రిపాలెం, నంగేగడ్డ గ్రామలలోని రామాలయాలు, , తీరప్రాంత పలు మత్స్యకార గ్రామాలలో, ఎస్సీ, ఎస్టీ వాడలలో శ్రీరామ నవమి సీతారాముల కళ్యాణ వేడుకలు కనుల పండువగా సాగాయి.



మచిలీపట్నంలో శ్రీ భద్రాద్రి రామాలయంలో సీతారాముల కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న దృశ్యం



సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

కమనీయం.. సీతారాముల కల్యాణం

కోడూరు: శ్రీరామనవమి పర్వదిన వేడుకలను కోడూరు, చుట్టు పక్కల గ్రామాల్లో ఆదివారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. జగదభిరాముడు, సీతాదేవి అమ్మవార్ల కల్యాణాన్ని కనులపండువగా జరిపారు. కోడూరు యర్రారెడ్డివారి పాలెం రామాలయం, విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని రామాలయం వద్ద స్వామివార్ల విగ్రహాలను ఊరేగించి, కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. షిర్డిసాయి దివ్యజ్ఞాన ధాన్య మందిరం, అయ్యప్పస్వామివారి ఆలయాల్లో కూడా నవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లింగారెడ్డిపాలెం రామమందిరం వద్ద ఆలయ ట్రస్టీ శీలంశెట్టి శైలేంద్ర– వీణ దంపతులు కల్యాణదాతలుగా వ్యవహరించి, గ్రామస్తులకు అన్నసమారాధన జరిపారు. జరుగువానిపాలెం, ఇస్మాయిల్‌బేగ్‌పేట, పోటుమీద, ఉల్లిపాలెం, నరసింహపురం, స్వతంత్రపురం గ్రామాల్లోని రామమందిరాల కమిటీల సభ్యులు డప్పువాయిద్యాలు, మేళతాళాల నడుమ స్వామివారి చిత్రపటాలను ప్రత్యేక వాహనాల్లో ఊరేగించుకుంటూ వెళ్లి ఉల్లిపాలెంలోని కృష్ణానది వద్దకు తీసుకువెళ్లి పుణ్యస్నానాలు చేయించారు. పిట్టల్లంక, యర్రారెడ్డివారిపాలెం రామాలయంలో స్వామివార్ల కల్యాణం జరిపి, అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు పానకం, వడపప్పు ప్రసాదం పంపిణీ చేశారు.

వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు

చల్లపల్లి: శ్రీరామ నవమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పడమరవీధిలోని తాళ్ళరామాలయం, రాఘవపురపు వెంకటకృష్ణమ్మ, జానకీ రామాలయం, బస్టాండు సెండర్లోని పంచముఖ అంజనేయస్వామి ఆలయం వద్ద, తూర్పువీధి రామాలయం వద్ద, రాజ్యలక్ష్మి ఆసుపత్రి వీధిలోని రామాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీపురం, మంగళాపురం, మాజేరు, వక్కలగడ్డ, యార్లగడ్డ, పురిటిగడ్డ, నడకుదురు, వెలివోలు, పాగోలు, ఆముదార్లంక గ్రామాల్లో రామాలయాల్లో భక్తి శ్రద్ధలతో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించారు. పానకాలు, వడపప్పు చలిమిడి ప్రసాదాలు పంపిణీ చేశారు. పలు ఆలయల్లో అన్నసమారాధనలు నిర్వహించారు.

గూడూరులో కనులపండువగా సీతారాముల కల్యాణం

గూడూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు కనులపండువగా నిర్వహించారు. గూడూరులోని కొల్లు వారి వీధిలో జరిగిన కల్యాణోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామిని తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ భక్త బృందం ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. తరకటూరు, మల్లవోలు, ఆకులమన్నాడు తదితర గ్రామాల్లో స్వామి వారి కల్యాణం ఘనంగా జరిగింది.

మోపిదేవిలో....

మోపిదేవి: మండలంలోని పలుగ్రామాల్లో భక్తి భావం వెల్లువిరిసింది. శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం ఊరువాడా సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం సాంప్రదాయ బద్ధంగా ఎడ్లబండ్లపై సీతారాముల భారీ చిత్ర పటాలతో సమీపంలోని కృష్ణానదికి తరలివెళ్లి స్నానాలు ఆచరించిన అనంతరం ఊరేగింపుగా గ్రామాల్లోకి తరలివచ్చారు. స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలోనూ ఆలయ డీసీ దాసరి శ్రీరామ వరప్రసాద్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం వేదపండితులు ఘనంగా నిర్వహించారు. మోపిదేవి రామాలయం వద్ద రావి హైమకుమార్, నళిని దంపతులచే సీతారాముల కల్యాణం సాంప్రదాయ బద్ధంగా వేదమంత్రాల నడుమ నిర్వహించారు. వెంకటాపురం కోదండరామాలయం, పెదప్రోలు దళితవాడ రామాలయం, కోసూరువారిపాలెం రామాలయం, మోపిదేవి గౌడపాలెం, గొల్లపాలెం రామాలయం తదితర ప్రదేశాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవాలతో ఆధ్యాత్మికతశోభ వెల్లివిరిసింది. అనంతరం మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరావు ఆధ్వర్యంలో అన్నసంతర్పణ జరిగింది.

అంగరంగ వైభవంగా కల్యాణోత్సవం

పెడన: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంతో పాటు మండలంలోని వివిధ ఆలయాలలో ఆదివారం సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెడన బస్టాండు సమీపంలోని గణపతి, సాయి, సీతారామాంజనేయస్వామి దేవస్థానం వద్ద పటమట నాగఅమృత సాగర్, సునీత దంపతులచే సీతారామకల్యాణాన్ని పూజారి భవాని జరిపించారు. పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల అనంతరం భక్తులకు పానకం, వడపప్పులను అందజేశారు. సంఘ పెద్దలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ నెల 14వ తేదీన భారీ అన్న సమారాధన ఉంటుందని తెలియజేశారు. 7, 8వ వార్డులలోని శ్రీకోదండ రామాలయంలో ఆలయ ధర్మకర్త కోడూరు కృష్ణారావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాపులవీధిలోని రామాలయంలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించగా ఆలయ కమిటీ వారు పాల్గొని భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. పెడన బస్టాండు సమీపంలోని చేపలమార్కెట్ వద్ద మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. నడుపూరు, నందమూరు, బల్లిపర్రు, చేవేంద్ర, చెన్నూరు తదితర గ్రామాల్లోని ఆయాల్లో శ్రీరామనవమి వేడుకలలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాడవాడలా శ్రీరామనవమి కల్యాణోత్సవాలు

బంటుమిల్లి: మండల పరిధి నాగేశ్వరరావుపేట గ్రామంలోని రామాలయంలో నిర్వహించిన కల్యాణంలో స్వామివారికి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదు దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. అలాగే జానకీరామపురం, నాగేశ్వరరావుపేట, మల్లేశ్వరం తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో పలు గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పలు ఆలయాల్లో గత తొమ్మిది రోజులుగా వసంత నవరాత్రి పూజలు రాములవారి కల్యాణంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రధాన మూర్తులను సుందరంగా అలంకరించి ఉదయం విశేష పూజలు నిర్వహించారు.

వైభవంగా సీతారామ కల్యాణం

కృత్తివెన్ను:శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మండల వ్యాప్తంగా రామనామ స్మరణతో భక్తులు పులకించిపోయారు. పలు గ్రామాల్లోని రామాలయాల్లో సీతారామ కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. యండపల్లి, అడ్డపర్ర గ్రామాల్లో అన్నసమారాధనలు ఘనంగా జరిగాయి. స్వామివార్లను సుందరంగా అలంకరించి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నీలిపూడి, సీతనపల్లి, పల్లెపాలెం, కృత్తివెన్ను, మాట్లాం, చినగొల్లపాలెం తదితర గ్రామాల్లో నవమి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.

ఘంటసాల: మండలంలో శ్రీరామ నవమి వేడుకలు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం గ్రామంలోని ముదిరాజుల శ్రీకోదండ రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిపించారు. అలాగే ఘంటసాల, దేవరకోట, మల్లంపల్లి, యండకుదురు, శ్రీకాకుళం, తదితర గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన, స్వామి వార్లను గ్రామోత్సవం నిర్వహించారు.

అలరించిన మురళీ కోలాటం

ఘంటసాల: శ్రీరామ నవమి సందర్భంగా అంబేద్కర్ నగర్‌లో ఏర్పాటు చేసిన మురళీ కోలాటం భక్తులను అలరించింది. కొడాలి, శ్రీకాకుళం, మల్లంపల్లి గ్రామాల నుంచి మురళీ కోలాట భక్త సమాజాలు సంయుక్తంగా భజన గురువు నాగేశ్వరరావు పర్యవేక్షణలో పలు భక్తి గీతాలను ఆలపిస్తూ లయబద్ధంగా మురళీ కోలాటం చేశారు. ఈ కోలాటంలో విద్యార్థులు, మహిళలు పాల్గొనడం విశేషం. భక్తులు ఆసక్తిగా కోలాటాన్ని తిలకించారు.



మల్లవోలులో పూజలందుకుంటున్న స్వామి వారు



కృత్తివెన్ను మండలం గాంధీనగరంలో ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణులు



బంటుమిల్లి రామాలయంలో సుందరమైన అలంకారంలో సీతారాములు ప్రధాన మూర్తులు



కోడూరు అయ్యప్ప ఆలయంలో సీతారామస్వామివార్ల కల్యాణమూర్తులు



కృష్ణానదిలో స్నానమాచరించి ఎడ్లబండిపై ఊరేగింపుగా వస్తున్న భక్తులు



కోలాటం ప్రదర్శిస్తున్న దృశ్యం

పోలీసు రామాలయంలో ఘనంగా శ్రీరామనవమి



పోలీస్ రామాలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని జరిపిస్తున్న ఎస్పీ దంపతులు



పెద్ద ఎత్తున పాల్గొన్న పోలీస్ అధికారులు వారి కుటుంబాలు

కోనేరుసెంటర్: కృష్ణా జిల్లా పోలీస్ రామాలయంలో శ్రీరామనవమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు దంపతులు కుటుంబ సమేతంగా పాల్గొని సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. పోలీస్ కళ్యాణ మండపంలో కృష్ణా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం జరిగిన అన్న సమారాధన కార్యక్రమంలో ఎస్పీ పోలీస్ కుటుంబాలకు స్వయంగా వడ్డన చేశారు. జిల్లా అడిషనల్ ఎస్పీ వీవీ నాయుడు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ, బందరు డీఎస్పీ సీహెచ్ రాజా, సీఐలు, ఎస్సైలతో పాటు పోలీసు కుటుంబాలు పాల్గొన్నాయి.



కోడూరులో రాములోరి కల్యాణానికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు తీసుకువస్తున్న భక్తులు



రాజుపేట చెక్కల మేడ సమీపంలోని రామాలయంలో అన్న సమారాధన నిర్వహిస్తున్న దృశ్యం



భావదేవరపల్లిలో సీతారాములకు తలంబ్రాలు పోస్తున్న ఎమ్మెల్యే మండలి దంపతులు



గుణ్ణలపల్లిలోని కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం



పెడన బస్టాండు వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



బంటుమిల్లి మండలం పెందుర్రు గ్రామంలో రాములవారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు



పడమరవీధిలోని తాళ్ళ రామాలయం వద్ద నిర్వహించిన అన్నసమారాధన

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

మోపిదేవి: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు రెడ్‌క్రాస్ మండల శాఖ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు ఆదివారం అందచేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లో శనివారం నాలుగు పూరిళ్లు కాలి బూడిదయ్యాయి. ఆకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో కట్టుబట్టలతో బాధితులు రోడ్డున పడ్డారు. విషయం తెలుసుకున్న గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ బాధిత కుటుంబాలు రాజులపాటి రాజేశ్వరమ్మ, సింగోతు రంగారావు, పెంద్ర ముసలి, మోర్ల సీతారావమ్మను కలసి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మాజీ గ్రామ సర్పంచ్ కొల్లి చక్రపాణి జ్ఞాపకార్థం మురళీ గ్రామ ఉప సర్పంచ్ కోనేరు సుందరసింగ్, టీడీపీ నేత పరుచూరి శ్రీనివాసరావు ఆర్థిక సౌజన్యంతో ఒక్కొక్క బాధిత కుటుంబానికి రూ. 2,500 వేలు నగదు, బియ్యం, కూరగాయలు, వంటపాత్రలు, దుప్పట్లు అందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ మోపిదేవి బ్రాంచి తరపున మండల అధ్యక్షులు సుబ్బారావు, ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యేశ్వరరావు హైజనిక్ కిట్లు, తారబస్లు, వంట పాత్రలు అందచేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు నడకుదిటి జనార్ధనరావు, జనసేన మండల అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్, బీజేపీ నేత వెంకట గిరి తదితరులున్నారు.

5 శాతం రాయితీతో పన్నులు చెల్లించండి

మచిలీపట్నంటౌన్: నగర పరిధిలో ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను ఈ నెలాఖరు వరకూ 5 శాతం రాయితీతో చెల్లించవచ్చునని కమిషనర్ బాపిరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి పన్నుల చెల్లింపు ఆన్‌లైన్ సేవలు నిలిచిపోవటంతో పన్నులు కట్టించుకోలేకపోయామన్నారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ నగర పాలక సంస్థ కార్యాలయంలోని కౌంటర్ వద్ద 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నులు చెల్లించవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని మచిలీపట్నం నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలి

గూడూరు:బీసీ, కాపు కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని ఎంపీడీవో బి.రాజేశ్వరి కోరారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తుతో పాటుగా ఒరిజినల్ కుల ధ్రువపత్రం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్‌లతో పాటుగా ఒక సెట్ ఫొటోస్టాట్ కాపీ కూడా వెంట తీసుకురావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ పరిధిలో వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 7వ తేదీ సోమవారం, 8వ తేదీ మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని కమిషనర్ బాపిరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇంటర్వ్యూలు నగరంలోని బుట్టాయిపేట టౌన్‌హాల్లో ఉంటాయని పేర్కొన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తు జిరాక్స్, తదితర ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు

డీఎస్పీ విద్యశ్రీ

చల్లపల్లి: వేసవిలో దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని అవనిగడ్డ డీఎస్పీ తాళ్ళూరి విద్యశ్రీ అన్నారు. స్థానిక సంపటాలమ్మ తల్లి గుడి వద్ద కృష్ణా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని డీఎస్పీ చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. తొలుత అయ్యప్పస్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకొచ్చి మరెన్నో చలివేంద్రాలు ఏర్పాటుచేయాలని కోరారు. ఆమె వెంట చల్లపల్లి సీఐ, ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.



హరికృష్ణ బృందానికి సన్మానం



పెడన:శ్రీగంగా పార్వతి సమేత అగస్త్యేశ్వర స్వామి వారి దేవస్థాన ప్రధాన గర్భలయ ద్వారానికి వెండి తాపడం తయారు చేసిన తెనాలి వాస్తవ్యులు బియ్యపు హరికృష్ణతో పాటు ఆయన బృంద సభ్యులను దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు సన్మానించారు. ఆలయంలో ఆదివారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు బళ్ల ప్రసాద్ మాట్లాడారు. మామిడి ప్రసాదరావు, చందన నారాయణరావు, అగస్త్యయ్య, కమిటీ సభ్యులు కొత్త నవీన్, వెంకటేశ్వరావు, అగస్త్యయ్య, ఇమ్మడి నాగపోతారావు, వీణం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.